# ‘నన్నెల్ల నేరవా’

పాలడుగు దుర్గాప్రసాదరావు

“ఆత్మ వత్సర్వభూతాని” అని నిరూపిస్తూ వుంది నీ రూపం.

నిదురించే నా కళ్లల్లో నీవే
నిద్రించిన నా గుండెల్లో నీవే
నా స్వప్నాలకు ప్రాణము నీవే.

తెల తెల్లవారింది. ‘కో’ అని కోడికూసింది. కోడి గొంతుకతో మేలుకొల్పుతున్నావేమోనని భ్రమతో ముసుగు విదిలించి నీ కొంగు పట్టుకో బోతే దోమతెరకొంగు దొరకింది — ఆశ నా కళ్లను నులిపింది. చుట్టూ పరికించి చూశాను. రాధా కృష్ణుల పటం కన్పించింది. రాధిక చిలిపి కళ్లల్లో నీ కళ్లుదూరి నన్ను వెక్కిరిస్తున్న ట్లున్నాయి. నీవు యిక్కడేవుంటే. ఒక గాఢ పరిష్వంగంతోనూ, రెండు తియ్యని ముద్దు లతోనూ, శిక్షించాలనిపించింది. కాని నీ వెక్క డున్నావు? నే నందుకోలేని ఆనందానివియ్యై తై తెక్కలాడుతున్నావు. నిన్ను మర్చి పోదామని పుస్తకశాలకు వెళ్లాను. నండూరి “ఎంకి” దొరకింది.

ఎంకి తన ప్రియుణ్ణి నిద్రలేపుతూవుంది. ప్రియుడు ‘ఎంకి’ని కలలో కంటూ తన్ను నిద్రనుంచి మేల్కొల్పవద్దని వారిస్తున్నాడు. నాకు నవ్వు వచ్చింది. కాని ఎంకి నవ్వుచూసి ఆగి పోయాను. ఎంకి ముసి ముసి నవ్వులకు ప్రకా శానివి నీవై నీవే కన్పించావు. కోపంవచ్చి పుస్త కం మూసేశాను.

ముఖ ప్రక్షాళనం చేద్దామని బయటి కొచ్చాను. ప్రక్కింట్లో కుర్రాడు.

“ఇందు గల డందులేడను
సందేహమువలదు చక్రి సర్వోపగతున్
ఎందెందు వెదకి చూచిన
అందందేగలడు దానవాగ్రణి వింటే”.

అంటూ చదువుతున్నాడు. యీ భక్తి భావా నికి నే నీరోజు విలువ యివ్వగల్గుతున్నాను.

“లేడను” కాదు “లేదను” సందేహమెందుల కన్పించింది.

భక్తునికి భగవంతుడు క్షణక్షణానికి కన్పిస్తు న్నట్లు కన్పిస్తూ కన్పించకుండా కవ్విస్తాడు. అట్లా కవ్విస్తాడు కనుకనే కవ్వింపులోని మాధు ర్యాన్ని గ్రోలిన భగవత్ సందర్శనా పిపాసులు కథలూ, కావ్యాలూ, సృష్టించి ఆ మధుర బాధను మనకవగత మయ్యేలా చేశారు.

**అట్లాగే నీలోని అనంత ప్రేమజ్యోతి నన్ను కవ్విస్తూ పూరిస్తూ వుంది.**

ఆశ మానవునిలో ప్రాథమిక లక్షణ మయ్యింది. నిరాశలోనూ, ఆశనే చూస్తాడు ఆశాదృష్టితోనే గాఢాంధకారాన్ని చీల్చటానికి ప్రయత్నిస్తాడు.

అడుగడుగునా అడ్డు నిలచే అవాంతరాలవల్ల ఆశ ఆగదు — నిమిష నిమిషానికి ఎదురయ్యే నిరాశకూడ నిమేష వ్యక్తిత్వంతో మరుగుపడి మరల ఆశారూపంలో ప్రత్యక్ష మవుతుంది. ఆశ — మానవ జీవన సర్వస్వాల నాక్రమించు కొన్న ఆశ — ఆరూపంలో అవతరించి నన్ను అతులితబాధతో అతలాకుతలం చేస్తున్నావు.

అవును నీ తప్పేముంది? . . . అన్నెం పున్నెం ఎరుగని రోజుల్లో అమాయకంగా నీ హృదయాన్ని చేజార్చుకొన్నావు — లోకా లోకనం తెలియని రోజుల్లో — నాగరికత పేరిట హృద యాన్ని కప్పిపుచ్చటం తెలియని కన్నె హృద యంతో — వన్నె చిన్నెలతో ప్రేమ నీ మన సులో చిందులు విందొనరుస్తుంటే . . . ఆ ప్రేమ రాగానికి నీవు లయవై కలసి నాట్యమా డావు. ఆ అమృత మయ నాట్యానికి కర్తను, హర్తను, భర్తనుగా అక్రమ జీవితాలందారంతో పెనకొనిన నన్ను జేసికొన్నావు.

నాలో ఏ శక్తిని చూసి ప్రేమించావో నాకే తెలియదు . . . . ఆ రోజుల్లో ‘ఒడలు జిదిమిన పాలు గార” న్నట్లుండేదానవు.

“నీ పెదాలపై సంజకెంజాయ నాట్యమాడు తుందేమిటంటే” — యిట్టే నీ కపోలాలు రాగ రంజితాలయ్యేవి.

ఆ రోజుల్లో ఏ కొత్త భావాన్ని దాచుకోటాని కయినా నీ హృదయంలో చోటు వుండేదికాదు. బాధలగాథ తెలియని బుద్ధినీది. బాధతెలియని మమతతో కోకిలలా పాడేదానవు. చిలుకలా కిలకిల నవ్వేదానవు. నెమలిలా ఆనంద పింఛం విప్పి గంతులు వేసేదానవు. యింటికి రావటం కాస్త ఆలస్యం అయితేచాలు, మూతి బిగించుకొని, కన్నులలో ప్రేమవాలికిపోతుంటే మిథ్యాకోపంతో ప్రదర్శిస్తూ “అయ్యగారికి యిప్పటిదాక తీరికలేదనుకొంటాను” అంటూ ఒక్క తూపు లాంటి చూపును ప్రసరించే దానవు.” “రాణి గారికి కోపం వచ్చిందా’ అని అనునయిస్తేచాలు కరగిపోయి కిలకిలా నవ్వేదానవు. ఆరోజుల్లో నీ ప్రతి చేష్టలోనూ తన్మయత్వమే పులిక్కిపడి చూసేది. ప్రతి భావంలోనూ అమాయకత్వం తొంగిచూసేది.

నీకు గుర్తుందో లేదో మీ అమ్మ నాకప్ప గిస్తూ “యింగ్లీషు బొత్తిగా రాదు. కాస్త శ్రద్ధతీసికో నాయనా” అంటుంటేపదహారేడుల పొగరు వయసు సిగ్గులోంచి క్రీగంటితో భయం భయంగా చూశావుకదూ మేష్టరు గిరివాటున అణగి మణగి యువక రూపంలో నున్న యీ నన్ను? . . . . !!!

అవును యవ్వనం వయస్సును చక్కిలిగిం తలు పెట్టుంది. అది సహజమే. ఆ చక్కని చక్కిలి గింతలకు తట్టుకోలేక కిలకిలా నవ్వి నవ్వు నవ్వుకూ నవరత్నాలు కురిపించి నా హృదయంలో పోశావు. దరిద్రుడు పట్టుకుంటే బంగారం కూడ మట్టి లవుతుంది. అంతే అయింది. నీవు యిచ్చిన నవరత్నాలిన్నీ విధి మాయచేసిన మట్టి ముద్దలై ఎదురు తిరిగి నన్నే మొట్టినాయి.

నియమాలు, నియంత్రణబంధనలు, కట్టులు కట్టుబాట్లూ, అంతస్థుల తారతమ్యాలు, సాం ఘిక వైషమ్యాలు, ఎదురు తిరిగి నీమీదకు దాడికి వెడలినాయి.

అవును. యిది సంఘం — తన తప్పులను కప్పుకోటానికి ఎదుటివారివి వేలెత్తి చూపే కపటి సంఘం — తరతరాల నుంచి స్వార్థానికి మేడలుకట్టే సంఘం — నీతికి నిజాయితీకి గోరికట్టి — స్వీయ సుఖాలకు భోగాలకు పునాదు లేసుకొనే పవిత్ర వ్యవస్థ యీ సంఘం — —

యిట్లా కుళ్లుతో కళ్లప్పగించి చూసే ముళ్ల పొద ఒకటుందని నీకేం తెలుసు పాపం!

ప్రతి మనిషి హృదయంలో ప్రేమనూ, మానవత్వాన్నే చూశావు. అవును ధర్మరాజు ప్రపంచంలో వుండే ధర్మాన్ని తప్ప అధర్మాన్ని చూడగలిగాడా—!

నీవు ప్రేమమయివి. కరుణామయివి. మాన వత్వ ప్రదాయివి. మమతా నిలయివి.

నీ అభీష్టానికి ఎదురు తిరిగిన నీ తల్లిదం డ్రులను ప్రేమించగల్గుతున్నావు. నీమీద నీలాప నిందలు మోపే సంఘాన్ని గౌరవిస్తున్నావు.

అవును వీళ్లంతా నీ దృష్టిలో తల్లిని కొట్టే బిడ్డలు లాంటివాళ్ళు. వీళ్లందర్నీ ఆదరించి దరికి తీస్తావు. మరి నన్ను ఏ మూల దాచావో నీ హృదయంలో. . .

నీకు గుర్తుందో లేదో. . .

సెలయేరు కులుకుతూ నిన్ను పలుకరిస్తోంది. ఆ ఏకాంత ప్రశాంతతతో — ప్రకృతి కవుగిలిలో నున్న సెలయేటిలో కాళ్లూపుతూ నాకోసం నిరీక్షిస్తున్నావు.

చాటునుంచి నేను వచ్చి —

“నన్నెల్ల నేరవా రాజా!” అంటూ నండూరి గీతాన్నాలాపించాను.

“నాకోసం రాసినట్లే వుందికదూ యీ పాట” అని అడిగావు అమాయకంగా నా ముఖం లోకి చూస్తూ.

“అవును శశీ” అన్నాను.

“అలాగా బాబో” అని వెక్కిరించావు

"అలాగే కాని నేను వారిలా విరహగీతాలు రాయను నీ మీద — నీలోని మానవత్వాన్ని —మమతనూ, ప్రేమనూ, దయనూ, లోకానికి చూపుతాను సరేనా'' అన్నాను.

"ఎప్పుడూ?'' అని ప్రశ్నించిన నీతో ఆవేశంతో ''ఇప్పుడే'' నంటూ యీ గేయం చెప్పాను.

"ఈసంఘపు కుళ్ళు కళ్లను
ఈదీర్ఘపు ముళ్ల మళ్లను
తెంపి వేస్తాను చెళ్లు చెళ్లున
అంధకారపు గుళ్లలో భళ్లున
ప్రేమయే ఆశయే దొర్లి పొర్లగా
నేనే నిలువెల్ల వెల్లువనై
చెంగు చెంగున దూకుతాను''

అని ఏదేదో మూగవేదనలో పలికిన దానిని నీ వింటూ కరిగిపోయి ''ప్రియా! నీ ఒక కవివి కాదు మహాకవి వవుతావు'' అనినాలో విశ్వాసపు జ్యోతిని వెల్గించావు— ఆజ్యోతి నాధారంచేసికొని సంఘం మీద ద్వేషాన్ని మిళాయింపుచేసి నా రచనా సంపుటాలనునింపుతుంటే మండిపడినాకు వ్రాసిన పుత్తరం ఇంకా నా దగ్గరనే వుంది. అందులో ప్రతిమాటా నా జీవితానికి బాటవేసింది—అదులో ప్రతిభావం నా భవితవ్యానికి వంతెన కట్టింది..

అందులో ఏమన్నావో గుర్తుందో....

"ప్రియా!

నీ జీవిత ప్రథమాధ్యాయంలో సంఘానికి ప్రేమను, ఆశను, విశ్వాసాన్ని అందివ్వటానికని ప్రతినకొన్నావు. స్వార్ధంకోసం నీకోసం. నీకు ఈ సంఘం చేసిన అపచారాన్నాధారం చేసికొని తిట్టిపోస్తున్నావు. యిదిన్యాయమేనా?.. తల్లి కొడుకును ప్రేమిస్తుంది. కాని కొడుకు వీధిలోని దుమ్మును తల్లి కిరాయటంలో సర్దాపడి రాస్తాడు. అంతమాత్రంలోనే కుమారుణ్ణి మాతృమూర్తి ద్వేషిస్తుందా ?...............''

ఎంత గొప్పగా ఆలోచించావు. వీటిలో సమాధానాలు వ్రాయలేక పోయానంటే మరిఅసంబద్ధ మేముంది!

నీ కన్నెరికపు చిన్నతనమంతా ఏమయిపోయింది! నీలోని కోరికల చారికలు కూడ కన్పించకుండా ఏమయినై!.....—

మామూలుగా స్త్రీ ప్రేమించి విఫలమందితే భద్రకాళియై సంఘానికి ఎదురు తిరుగుతుంది. కాని నీవో మాతృమూర్తివై ఆదర్శప్రాయంగా నిలిచావు.

యువక రక్తం పొంగి పొర్లే రోజులలో ''లేచిపోదాం రమ్మన్నాను''నేను.

"కాలం మీద భారం వేద్దాంకాని యీ కాని కామానికి లొంగి పండులాంటి మనజీవిత పుష్పాలను మనమే నాశనం చేసికోవటం భావ్యం కాదు— లేచిపోయి నీవూ నేను సుఖించేదేమీ లేదు. నీజీవితమంతా నా కోసం కష్టపడాల్సి వస్తుంది. అప్పుడు ఈప్రపంచాన్నే మరచిపోతావు. నీ ఆదర్శాలకు అంతిమం నేనవుతాను. నా ఆనందం నీవుపైకి రావటం. నీవుగొప్పవాడివయినకొలదీ నాహృదయం ఆనందం మరింత మరింత నిండుతూ వుంటుంది. అంతేచాలు నిరీక్షించుదాం'' అన్నావు.

యింతటి గాఢ నిగూఢత నీలో ఎలాచోటు చేసికొన్నదో అర్థం కావటం లేదు. దినాలు గడుస్తున్న కొద్దీ నీవు పెద్దదానివై— నేను చిన్నవాణ్ణయి పోతున్నాను. నీలో ప్రత్యణువునా పవిత్రతయే ప్రతిబింబిస్తూ వుంది.

నీ పవిత్రత మూలంగానే నేనూ పవిత్రుణ్ణి అవుతున్నాననిపిస్తోంది. ఒకప్పుడు నీకునేను పాటలు నేర్పాను. కాని ప్రేమంటే ఏమిటో అనే పాట నీవు నాకు నేర్పావు.

ప్రతి చోటా నువ్వే కనిపిస్తున్నావు. ప్రతి మనిషిలో నీబింబమే ప్రతిబింబిస్తూవుంది.''నీ'' అనేభావంతోనే ప్రపంచాన్నంతా ప్రేమించగలనేమో అనుకొంటున్నాను.

గులాబీలంటే నీకు చాలాయిష్టం. శారీరకంగా మనం చాలాదూరంలో వున్నాం. అయినప్పటికీ యీ ఎర్రగా నవ్వే గులాబీలను చూస్తుంటే నువ్వు నవ్వుతూ నాకిచ్చే గులాబీలనుకొని వీటిని కూడ ప్రేమిస్తున్నాను.

సాయంత్ర మయ్యిందిప్పుడు. చూడు.సంధ్యాదేవి సూర్యునికి వీడ్కోలిస్తూ విచారిస్తోందనుకొంటాను. అరుణ కపోలాలు కెంపులెక్కాయి. పిల్లగాలులు వీస్తూ చూస్తున్నాయి ప్రేయసీ ప్రియులను.

రాణీ! నాకేమనిపిస్తోందో తెలుసా! యీ గాలులు నిన్నుసోకి వస్తున్నాయి. నన్నూ తాకుతున్నాయి. ఈ చిరుగాలులస్పర్శలో కూడ నీ ఆనందాన్నే పొందుతున్నాను.

నిర్మల నీలాకాశాన్ని చూస్తుంటే అక్కడ వుండి నీవు ఆకాశం వంక తూపులై వయనించి వస్తున్నట్లు భావన కల్గుతోంది.

సిగరెట్టు తాగుదామనే వుద్దేశంతో అగ్గిపుల్ల వెల్గిస్తుంటే ఈ అగ్నిలో నీగుండెల్లో రగిలే అగ్ని కనిపిస్తోంది.

స్నానం చేసే టప్పుడు నదీ జలాలు ''నీ ప్రేయసి మాలోనే జలక్రీడ లాడింది'' అన్నట్లు అనిపించి మరింతసేపు వాటిలో జలక మాడాను.

పచ్చని పైరుపొలాల భూములలో తిరుగాడుతుంటే ఈభూమినీ స్పర్శానందంచే గగుర్పాటు చెందినదనిపిస్తూవుంది. ఆకాశంశ్యామలం నీకోమలతనే బింబిస్తోంది. చిరుగాలులు గుసగుసలాడుతూ నీ స్పర్శనే స్మరిస్తున్నాయి.

జలం నీ సౌందర్య సకలంతో కలకలలాడుతున్నాయి. అగ్ని నీహృదయాగ్ని సంస్పర్శనే దీప్తిస్తోంది.

పృధ్వి నీహృద్గీతిలోనే ప్రకంపిస్తోంది.

యిలా పంచ భూతాల్లో నీవేనాకు ద్యోతకమవు తున్నావు.

నేను నిన్ను హృదయమార ప్రేమిస్తున్నాను. అందుకే పంచ భూతాలను ప్రేమించ గల్గుతున్నాను.

పంచభూతాలే మానవ దేహంలో వున్నాయి కనుక నేనునిజంగా వీటిని ప్రేమిస్తే మానవ జగతినంతా ప్రేమించాలి.

యీ విశ్వమంతా నిండివున్నాయి పంచభూతాలు—ఆత్మ పంచభూతాత్మకమైనది. అందుకనే యీ విశ్వాన్నంతా ఆవరించి యున్న ''నిన్ను'' ప్రేమిస్తున్నాను.

నేను నిన్ను ప్రేమిస్తున్నానంటే యీవిశ్వసృష్టినే ప్రేమిస్తున్నట్టు, కనుకనే వాక్కు "ప్రేమవత్సర్వ భూతాని'' అని వినిస్తూవుంది.

